VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 28 శనివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 160

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల







2లో

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ

సోమవారానికి వాయిదా వేసిన కోర్టు

వర్చువల్‌గా పాల్గొన్న బన్నీ



# దీక్షాదక్షుడికి అశ్రు నివాళులు

**మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని పుష్పాంజలి**

**కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్ కూడా..**

**నేటి ఉదయం 11:45 గంటలకు నిగమ్‌బోధ్ ఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**

**మాజీ ప్రధానికి సీఎంలు రేవంత్, చంద్రబాబు, స్టాలిన్, ఆతిశీ నివాళులు**

**సంస్కరణలతో దేశార్థికాన్ని నవ్యపథంలో నడిపించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని శుక్రవారం కన్నీటి నివాళులర్పించింది.**

దిల్లీ: సంస్కరణలతో దేశార్థికాన్ని నవ్యపథంలో నడిపించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని శుక్రవారం కన్నీటి నివాళు లర్పించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ తదితరులు ఆయన పార్థివదేహం వద్ద పుష్పాంజలి ఘటించారు. దేశానికి మన్మోహన్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో శనివారం ఉదయం 11:45 గంటలకు స్థానిక నిగమ్‌బోధ్ ఘాట్‌లో నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. 92 ఏళ్ల మన్మోహన్ అనారోగ్యంతో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన మృతికి అమెరికా, చైనా సహా పలు దేశాలు సంతాపం వ్యక్తం చేశాయి. త్రివర్ణ పతాకం చుట్టిన మన్మోహన్ పార్థివదేహాన్ని శుక్రవారం దిల్లీలోని ఆయన నివాసంలో ఉంచారు. ప్రధాని పదవిని వీడినప్పటి నుంచీ మన్మోహన్ అదే ఇంటిలో నివాసమున్నారు. పార్థివదేహం వద్ద ఆయన సతీమణి గురుశరణ్ కౌర్, ఇతర కుటుంబసభ్యులు విషణ్న వదనంతో కనిపించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖఢ్.. మన్మోహన్ నివాసానికి వచ్చి నివాళు లర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుకు?, దిల్లీ సీఎం ఆతిశీ, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే సహా పార్టీలకతీతంగా పలువురు నేతలు తరలివచ్చి మన్మోహన్‌కు నివాళులర్పించారు. భారత సైన్యం తరఫున సైనికాధికారులు.. మన్మోహన్ పార్థివదేహాన్ని ఉంచిన పేటికపై జాతీయ జెండాను ఉంచి సెల్యూట్ చేశారు. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు సాధారణ ప్రజలూ మన్మోహన్ ఇంటి వద్ద బారులు తీరి కనిపించారు. కేంద్ర కేబినెట్ సంతాపం

మన్మోహన్ కన్నుమూతపై కేంద్ర కేబినెట్ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన్ను గొప్ప రాజనీతిజ్ఞుడిగా కొనియాడింది. ప్రధాని మోదీ నేతృత్వంలో దిల్లీలో శుక్రవారం భేటీ అయిన కేబినెట్.. మన్మోహన్‌కు నివాళిగా తొలుత రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది. అనంతరం ఆయన గౌరవార్థం సంతాప తీర్మానాన్ని ఆమోదించింది. "దేశంపై మన్మోహన్ చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో దేశం గొప్ప రాజనీతిజ్ఞుడిని, ప్రఖ్యాత ఆర్థికవేత్తను, విలక్షణ నాయకుడిని కోల్పోయింది" అని అందులో పేర్కొంది. ప్రభుత్వం తరఫున, యావత్ దేశ ప్రజల తరఫున మన్మోహన్ కుటుంబానికి కేబినెట్ సంతాపం తెలియజేసింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా ప్రభుత్వం జనవరి 1 వరకూ ఏడు రోజుల సంతాప దినాలను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా శనివారం కేంద్రప్రభుత్వ కార్యాలయాలు, కేంద్రప్రభుత్వ అధీనంలోని ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాలకు సగం రోజుసెలవు ప్రకటించారు.



2లో

## నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

దేశం కోసమే తన జీవితాన్ని ధారపోశారు

మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం

సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం

## బీసీల రిజర్వేషన్లు పెంచకుంటే స్థానిక ఎన్నికలు జరగనివ్వం: ఎమ్మెల్సీ కవిత



బంజారాహిల్స్:ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్లితే... వాటిని జరగనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలపై ప్రభుత్వం ఆలోచించాలని స్పష్టంచేశారు. బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం జనవరి 3న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద భారీ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నలభై బీసీ సంఘాల నేతలు ఆమె నివాసంలో సమావేశమయ్యారు. మొదట మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో కవిత మాట్లాడుతూ... "బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చాకే, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే... రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. బీసీలకు బడ్జెట్‌లో ఏటా రూ.20 వేల కోట్లను కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ తప్పింది. కేంద్రం చేపట్టనున్న జనగణనలో కులగణనను చేయాలి" అని డిమాండ్ చేశారు. వివిధ బీసీ సంఘాల నేతలు బొల్లా శివశంకర్, సుమిత్ర ఆనంద్, మఠం భిక్షపతి, ప్రశాంత్, రాజేష్, హరి, మహేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసు

31 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

హైకోర్టులో విచారణ..31కి వాయిదా

2లో



2లో

## పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

వేగుచుక్క

# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ



**హైదరాబాద్:** నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద బయట ఉన్న అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ గడువు సైతం పూర్తి కావడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని నాంపల్లి కోర్టుకు తెలిపారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం అల్లు అర్జున్ తరఫున ఆయన లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. నాంపల్లి కోర్టు ఈ పిటిషన్ విచారణ స్వీకరించింది. కోర్టులో విచారణ ప్రారంభం కాగా, కౌంటర్ ధాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. దాంతో నాంపల్లి కోర్టు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నేరుగా కాకుండా వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. మొదట అల్లు అర్జున్ విచారణకు వస్తారని నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే వర్చువల్‌గా హాజరు అవుతారని ఆయన తరఫున లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లగా, అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు మన్నించింది. నాంపల్లి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియనుందని విచారణ జరిపారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. థియేటర్ వద్ద తొక్కిసలాట కేసు విచారణనూ సైతం నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. జనవరి 10వ తేదీన తదుపరి విచారణను చేపట్టనున్నట్లు కోర్టు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్ పై సైతం అదేరోజు విచారణ జరగనుంది.

# నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాప తీర్మానం చేసింది. మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఆయన నిజమైన రాజనీతిజ్ఞుడని, దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారని గుర్తు చేసుకున్నారు.ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై సంతాప తీర్మానం చేశారు. శనివారం జరిగే మన్మోహన్‌సింగ్ అంతిమసంస్కారాల నిర్వహణపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక, తదితర నేతలంతా పాల్గొన్నారు.

భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగంలో మన్మోహన్ ఒక మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన కృషి దేశాన్ని మార్చివేసిందని తెలిపింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని గుర్తుచేసుకున్నారు. 1990 ప్రారంభంలో ఆర్థిక మంత్రిగా భారతదేశ ఆర్థిక సరళీకరణకు రూపశిల్పి అని కొనియాడారు. అసమానమైన దూరదృష్టితో వరుస సంస్కరణలను ప్రారంభించారన్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించడమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు కూడా తలుపులు తెరిచాయని స్మరణచేసుకున్నారు. నియంత్రణ సడలింపు, ప్రైవేటీకరణ మరియు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి విధానాల ద్వారా భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి పునాది వేశారని నేతలు నెమరువేసుకున్నారు.

ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉద్భవించిందని కొనియాడారు. ఇది ఆయన ప్రతిభ, దార్శనికతకు నిదర్శనం అని సీడబ్ల్యూసీ పేర్కొంది. నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని పేర్కొంది.




# తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

**హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. జనవరి 2 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు సెషన్- 1; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 2, 5, 11, 12, 19, 20 తేదీల్లో ఆరు రోజులు పేపర్ -2 పరీక్షలు జరగనుండగా.. జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నాలుగు రోజులు పేపర్ -1 పరీక్షలు నిర్వహిస్తారు. నవంబర్ 7 నుంచి 20 వరకు టెట్‌కు దరఖాస్తులు స్వీకరించగా.. దాదాపు 2.75లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కు సంబంధించిన హాల్ టికెట్లను టీజీ టెట్ కన్వీనర్ శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు.

ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు.

అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డుల్లో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీని తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు


**రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న సర్పంచ్‌లు**




హైదరాబాద్: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్‌ల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను మభ్యపెట్టకుండా.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గాని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

# మన్మోహన్‌కేబినేట్‌లో పనిచేయడం అదృష్టం

**హైదరాబాద్:** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో
తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమయంలో ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనిది. తెలంగాణ సమాజానికి
అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌కు భారాస తరపున ఘన నివాళులు' అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీకి బయల్దేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ ఎంపీలు, పలువురు నాయకులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళు లర్పించనుంది. అంత్యక్రియల్లో పాల్గొని



మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని కేసీఆర్ పేర్కొన్నారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరుకానున్నారు అని కేసీఆర్ తెలిపారు.

# ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసు

హైదరాబాద్ :ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కేటీఆర్‌ను ఈనెల 31 వరకు అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. విచారణను డిసెంబర్ 31కి వాయిదా వేసింది. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు డిసెంబర్ 30 వరకు కేటీఆర్‌కు నాట్ టు అరెస్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, అరెస్ట్ చేయవద్దని గత విచారణలో హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం ఫార్ములా ఈరేస్ కేసు హైకోర్టులో విచారణకు రాగా.. ఏసీబీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఏసీబీ మరో పిటిషన్ కూడా దాఖలు చేసింది. కేటీఆర్ నాట్ టు అరెస్ట్ ఆదేశాలను ఎత్తివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 31 వరకు వాయిదా వేసింది. ఇప్పటి వరకు 30 వరకు ఉన్న నాట్ టు అరెస్ట్‌ను.. మరొక్క రోజుకు హైకోర్టు ధర్మాసనం పొడిగించింది. ఈనెల 31న నాట్ టు అరెస్ట్ పిటిషన్‌పైన అలాగే ఫార్ములా ఈ రేసింగ్‌కు సంబంధించి నమోదైన కౌంటర్‌పై కూడా హైకోర్టు పూర్తి స్థాయిలో విచారణ జరపనుంది. ఇప్పటి వరకు ఫార్ములా ఈరేస్ వ్యవహారానికి సంబంధించి సుదీర్ఘంగా వాదనలు వినిపించిన తర్వాత కేటీఆర్‌కు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే దాన్ని కూడా ఎత్తివేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఏసీబీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ సమయంలో కేటీఆర్‌కు బెయిల్ మంజూరు చేసినా, రిలీఫ్ ఇచ్చినా, నాట్ టు అరెస్ట్ ఇచ్చినా విచారణకు ఇబ్బందికర వాతావరణం ఉంటుందని ఏసీబీ వెల్లడించింది. నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని ఏసీబీ మరో పిటిషన్‌ను వేసింది. ఆ పిటిషన్‌కు సంబంధించి ప్రతివాదిగా కేటీఆర్‌ను చేర్చారు. దీంతో కేటీఆర్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న ఫార్ములా ఈ కార్ రేస్‌పై ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన వాదనలు కొనసాగుతాయి. అలాగే నాట్ టు అరెస్ట్‌పై కేటీఆర్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు జరుగనున్నాయి. ఈ రెండు అంశాలపై డిసెంబర్ 31న ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో దేశ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు. అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంది. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు.

# గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిన భారత్

**ఆయన మరణం దేశానికి తీరని లోటు**

**భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన చంద్రబాబు**



**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని.. అనేక పదవులను సమర్థంగా నిర్వహించారని చెప్పారు.భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు.. కానీ, ఆయన భావజాలం శాశ్వతంగా ఉంటుందన్నారు. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో గొప్ప ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని పేర్కొన్నారు.. మన్మోహన్ లేని లోటు ఎవరూ పూడ్చలేరన్న ఆయన.. ప్రధానమంత్రిగా, ఆర్థిక మంత్రిగా, యూజీసీ చైర్మన్‌గా, ఆర్బీఐ గవర్నర్ గా ఉన్నత బాధ్యతలు నిర్వర్తించారు.. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచారని గుర్తుచేశారు..ఇక, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి దశ దిశను రూపొందించారు మన్మోహన్ అని కొనియాడారు చంద్రబాబు నాయుడు.. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్టీఐ చట్టం, నరేగా, ఆధార్ లాంటి ఎన్నో పాలసీలు తీసుకొచ్చారు.. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని పేర్కొన్నారు. ఉన్నతమైన పదవుల్లో పనిచేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్.. ఆయన మంచి రాజకీయ నాయకుడన్న చంద్రబాబు.. మన్మోహన్ సింగ్ భావజాలం శాశ్వతంగా ఉంటుందన్నారు.. ఆయన లేకపోవడం
దేశానికి తీరని లోటు..

బాధాకరం అంటూ చంద్రబాబు నాయుడు భావోద్వేగానికి లోనయ్యారు.. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, తెదేపా ఎంపీలు కేశినేని చిన్ని, శబరి మాజీ ప్రధాని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

వేగుచుక్క

# డిసెంబర్ 27 నుంచే అమలు..

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కి చెందిన ఆ స్కీమ్‌లో కొత్తగా చేరేందుకు అవకాశం లేదు. ఇంటర్నేషనల్ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేసినట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అందుకు గల కారణాలను వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెలా కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈక్విటీల్లోనూ కొన్ని స్కీమ్స్‌కు మంచి ఆదరణ ఉంటుంది. వాటిల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. అలాంటి వాటిల్లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన పలు స్కీమ్స్ ఉన్నాయని చెప్పవచ్చు. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. తమ ఏఎంసీ నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోని ఓ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.


అంటే ఇకపై ఆ ఫండ్‌లో కొత్తగా ఇన్వెస్ట్ చేసేందుకు ఉండదు. ఇప్పటికే సబ్‌స్క్రైబ్ చేసుకున్న వారికి మాత్రమే ఫండ్ నిర్వహణ ఉంటుంది. అదే ఎస్‌బీఐ ఇంటర్నేషనల్ యాక్సెస్ యూఎస్ ఈక్విటీ ఫండ్




ఆఫ్ ఫండ్ ఈ ఫండ్‌లో కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆగిపోయాయి. అందుకు ప్రధాన కారణం ఉంది. ఇప్పటికే ఈ పథకంలో పరిమితి మేర పెట్టుబడులు వచ్చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన ఓవర్సీస్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిట్ దాటకూడదనే ఉద్దేశం తోనే కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆపేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది.

ఈ మేరకు తమ యూనిట్ హోల్డర్లకు నోటీసు ద్వారా ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఎస్‌బీఐ ఫండ్ హౌస్ తెలిపింది. డిసెంబర్ 27, 2024 నుంచే కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిపింది. లంప్‌సమ్ పెట్టుబడుల ద్వారా సబ్‌స్క్రిప్షన్లు (అదనపు కొనుగోళ్లు, స్విచ్ ఇన్స్ సహా), ఐడీసీడబ్ల్యూ బదిలీ కోసం సిప్, ఎస్‌టీపీ ద్వారా కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేయబడతాయని నోటీసులో పేర్కొంది. డిసెంబర్ 26వ తేదీ కట్ ఆఫ్ టైమ్ తర్వాతనే ఈ ఆంక్షలు అమలులోకి వచ్చేస్తాయని గుర్తు చేసింది. బదిలీ వంటి ప్రస్తుత సిస్టమాటిక్ రిజిస్ట్రేషన్లు తదుపరి నోటీసు వచ్చే వరకు పథకం కింద కొనసాగుతాయని పేర్కొంది. అలాగే స్కీమ్ పరిధిలో జరిగే బదిలీలు కొత్త రూల్స్ వర్తించవని తెలిపింది. అలాగే ఇతర షరతులు, నిబంధనలు ఏమీ మారవని స్పష్టం చేసింది.

# ఐఫోన్‌తో క్యాబ్ బుక్ చేస్తే ఎక్కువ ఛార్జీ పడుతుందా?




పెద్ద పెద్ద నగరాలతో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ క్యాబ్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. యాప్ ద్వారా బుక్ చేయగానే నిమిషాల వ్యవధిలో ఉన్న చోటికి వచ్చి పికప్ చేసుకుంటాయి. అయితే, ఇటీవల సోషల్ మీడియా వేదికగా యాప్స్ ఛార్జీలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆండ్రాయిడ్ డివైజ్‌ల కంటే ఐఫోన్‌లోని యాప్స్ ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నాయని ఫోటోలతో సహా కొందరు పోస్టులు పెడుతున్నారు.

సిటీల్లో ఉండే వారికి క్యాబ్ సర్వీసుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలా కంపెనీలు క్యాబ్ సేవలు అందిస్తున్నాయి. యాప్ ద్వారా బుక్ చేసుకున్న నిమిషాల వ్యవధిలో ఉన్న చోటుకే వచ్చి పికప్ చేసుకుంటాయి. తాము ఎంచుకున్న గమ్య స్థానాలకు చేరుస్తాయి. బుక్ చేసుకునే సమయంలోనే ఎంత ఛార్జీ అవుతుందని చెబుతాయి. బైక్, ఆటో, కార్, మినీ బస్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. దేని ఛార్జీలు దానికే ఉంటాయి. అయితే, కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఈ క్యాబ్ ఛార్జీల విషయంపై వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక రైడ్ కోసం ఒకేసారి ఆండ్రాయిడ్ ఫోన్, ఐఫోన్‌లో బుక్ చేస్తే వేరు వేరుగా ఛార్జీలు చూపిస్తున్నట్లు ప్రూఫ్స్‌తో సహా పోస్టులు పెడుతున్నారు. యాపిల్ డివైజ్ యూజర్లకు ఎక్కువ ఛార్జీలు వసూలు చేసేలా తమ ప్రైసింగ్ అల్గారిథమ్ తయారు చేశారంటూ ఆరోపిస్తున్నారు.

ఈ విషయంపై టైమ్స్ ఆఫ్ ఇండియా సైతం ఓసారి ప్రయత్నించి చూసింది. చెన్నైలోని మూడు లొకేషన్ల నుంచి ఒకే దూరంలోని గమ్య స్థానాలకు ఐఫోన్, ఆండ్రాయిడ్ డివైజ్‌ల ద్వారా రైడ్స్ కోసం సర్ఛ్ చేసింది. ప్రతి కేసులో ఆండ్రాయిడ్ కంటే ఐఓఎస్ డివైజుల్లోనే ఎక్కువ ఛార్జీలు చూపించినట్లు తేలిందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనం ప్రచురించింది. టీఓఐ ప్రకారం.. చెన్నైలోని మడిపక్కమ్ నుంచి ఫోనిక్స్ మాల్ వెలాచరికి ఆండ్రాయిడ్‌లో రూ.195 చూపించగా ఐఫోన్‌లో రూ.260 చూపించినట్లు తెలిపింది. ఇక అవాడీ నుంచి చెన్నై ఎయిర్‌పోర్ట్‌కి ఆండ్రాయిడ్‌లో రూ.961, ఐఫోన్‌లో రూ.1010 చూపించినట్లు పేర్కొంది. ఇక టీ నగర్ నుంచి ఎగ్మోర్ వరకు ఆండ్రాయిడ్‌లో రూ.180, ఐఫోన్‌లో రూ.344 చూపించిందని తెలిపింది.

అయితే, ఇలా కావాలని ఎక్కువ ఛార్జీలు చూపిస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. మరో రోజున అవే గమ్య స్థానాలకు రైడ్స్ సర్ఛ్ చేస్తే వేరు వేరు ఛార్జీలు చూపించింది. పైన చెప్పినట్లు సింగిల్ రైడ్స్, తక్కువ దూరం ఉన్న రైడ్స్‌కి అలా జరుగుతున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై స్పందించిన ఉబర్ రైడర్ల ఫోన్ల ఆధారంగా ఛార్జీలు వసూలు చేయాలనే పాలసీ ఏమీ లేదని స్పష్టం చేసింది. అయితే ఛార్జీలు అనేవి రైడ్ బుక్ చేసే సమయం, దూరం, రియల్ టైమ్ డిమాండ్ వంటి అంశాలపై ఆధాపడి ఉంటాయని పేర్కొంది. అయితే, ఈ విషయంపై ఓలా నుంచి ఎలాంటి స్పందన రాలేదని టైమ్స్ ఆఫ్ ఇండియా తెలిపింది.

అయితే, యాప్ ఇన్‌స్టాల్ చేసేటప్పుడు వినియోగదారులు సమ్మతి ఇవ్వాల్సిన హార్డ్‌వేర్ డేటాను రైడ్ హెయిలింగ్ యాప్స్ ఎలా యాక్సెస్ చేస్తాయనే దాని నుంచి ఈ అసమానతలు ఉత్పన్నమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ సర్వర్ వినియోగదారుల పరికరానికి అనుగుణంగా ఛార్జీల అంచనాలను సులభంగా రూపొందించగలదని రైడ్ హెయిలింగ్ ప్లాట్ ఫామ్ ఫాస్ట్రాక్ ఎండీ సి అంబిగపతి తెలిపారు. డైనమిక్ ప్రైసింగ్ అల్గారిథమ్ అనేది హార్డ్‌వేర్ వివరాల ఆధారంగా కంపెనీలు ఛార్జీలను సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. మరోవైపు.. రైడ్ ధరలు ఫోన్ మోడళ్ల మధ్య వ్యత్యాసానికే పరిమితం కాదని, ఇది తరుచూ యాప్స్ ఉపయోగించే వారికి, ఒకే పరికరంలో ఛార్జీలను పదే పదే తనిఖీ చేసే వారికి సైతం వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వ అగ్రిగేటర్ పాలసీ రూపొందించడంలో పాల్గొన్న ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ నిపుణుడు ఒకరు తెలిపారు.

# పన్ను శ్లాబుల్లో మార్పులు..

## స్టాండర్డ్ డిడక్షన్ పెంపు సహా ఏడాదిలో ఎన్నో మార్పులు..



టాక్స్‌పేయర్లు.. ఎప్పటికప్పుడు ఆదాయపు పన్నుకు సంబంధించిన మార్పుల గురించి తెలుసుకుంటూ ఉండాలి. ముఖ్యంగా టాక్స్ రేట్లు, డిడక్షన్స్, ఎగ్జెంప్షన్స్, టీడీఎస్ వంటి వాటిపై అవగాహన ఉంచుకోవాలి. ఐటీఆర్ ఫైలింగ్‌లో ఇవన్నీ కీలకంగా ఉంటాయని చెప్పొచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే సంవత్సరం రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో వచ్చిన మార్పుల్ని కచ్చితంగా తెలుసుకోవాలి. 2024 సంవత్సరం కొద్ది రోజుల్లో ముగుస్తోంది. అయితే ఈ ఏడాదిలో ఎన్నో మార్పులొచ్చాయి. ముఖ్యంగా ఆర్థిక పర నిర్ణయాల్లో ఎక్కువగా మార్పులు గమనించొచ్చు. కొద్ది రోజుల కిందట యూపీఐ మార్పుల గురించి తెలుసుకున్నాం. దీని గురించి ఇక్కడ తెలుసుకోండి. ఇప్పుడు మనం 2024 సంవత్సరంలో వచ్చిన ఆదాయపు పన్ను మార్పుల గురించి చూద్దాం. 2024 బడ్జెట్ సమయంలో వేతన జీవులకు స్వల్ప ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాత పన్ను విధానాన్ని అస్సలు టచ్ చేయకుండా.. కొత్త పన్ను వేతనంలో పలు కీలక మార్పులు చేసింది. పన్ను శ్లాబుల్లో మధ్యతరగతికి కాస్త ఊరట కలిగేలా మార్పులు చేసింది. ఇంకా స్టాండర్డ్ డిడక్షన్ కూడా కొత్త పన్ను విధానంలోనే పెంచడం విశేషం. వీటిల్లో చాలా వరకు పన్ను చెల్లింపుదారులు మర్చిపోయే అవకాశం ఉంది. అందుకే 2024లో ఏమేం మారాయో ఒకసారి చూద్దాం. వచ్చే ఏడాది ఐటీ రిటర్న్ ఫైలింగ్ సమయంలో ఇది ఉపయోగపడనుంది.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన మార్పుల ప్రకారం.. కొత్త పన్ను విధానంలో పన్ను శ్లాబులు మారాయి. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. ఇక గతంలో రూ. 3-6 లక్షలపై 5 శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు ఈ ఇన్‌కం బ్రాకెట్‌ను రూ. 3-7 లక్షలకు చేర్చిన సంగతి తెలిసిందే. అంటే ఇక్కడ రూ. 7 లక్షల వరకు ఆదాయంపైనా 5 శాతం పన్నే ఉంటుంది. రూ. 6-9 లక్షల శ్లాబుకు 10 శాతంగా ఉండగా.. దీనిని రూ. 7-10 లక్షలకు సవరించింది. ఇప్పుడు రూ. 10 లక్షల వార్షికాదాయం ఉన్న వారు కూడా 10 శాతం పన్ను పరిధిలోకే రానున్నారు. పాత విధానంలో ఈ మార్పులేం లేవు. రూ. 10-12 లక్షల ఆదాయవర్గానికి 15 శాతం పన్ను ఉంటుంది. 12-15 లక్షల మధ్య ఆదాయం ఉంటే 20 శాతం టాక్స్ చెల్లించాలి. ఆపైన ఉంటే 30 శాతం టాక్స్ పరిధిలోకి వెళ్తారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను కొత్త పన్ను విధానంలో రూ. 50 వేల నుంచి ఇప్పుడు రూ. 75 వేలకు పెంచింది. పాత పన్ను విధానంలో అస్సలు మార్చలేదు. ఇక్కడ ఇది రూ. 50 వేలుగానే ఉంది. ఫ్యామిలీ పెన్షనర్లకు రూ. 15 వేల నుంచి రూ. 25 వేలకు పెంచింది ప్రభుత్వం. వ్యవసాయేతర స్థిరాస్తి క్రయవిక్రయ ట్రాన్సాక్షన్స్‌లో వాస్తవ ధర, స్టాంప్ డ్యూటీల్లో ఏది ఎక్కువ ఉంటే దానిని పరిగణనలోకి తీసుకొని ఒక శాతం మూలం వద్ద పన్ను కోత విధించాలని స్పష్టం చేసింది. రూ. 50 లక్షలకు మించి విలువ ఉన్నప్పుడు ఇది వర్తిస్తుంది. ఆదాయపు పన్ను వివాదాలకు సంబంధించినటువంటి పరిష్కారాల కోసం వివాద్ సే విశ్వాస్ స్కీంను 2020లో కేంద్రం తీసుకొచ్చింది. దీనిని కొనసాగింపుగా బడ్జెట్‌లో వివాద్ సే విశ్వాస్ 2.0 ను ప్రభుత్వం ప్రతిపాదించింది. మరోవైపు పాన్ కార్డు దరఖాస్తు, టాక్స్ రిటర్న్ ఫైల్ చేసే సమయంలో ఆధార్ నంబర్, ఎన్‌రోల్‌మెంట్ ఐడీ రెండింట్లో ఏదో ఒకటి సరిపోయేది. ఇక మీదట కేవలం ఆధార్ సంఖ్యను మాత్రమే వినియోగించాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన బాండ్లపై వచ్చిన వడ్డీకి మూలం వద్ద పన్ను కోత 10 శాతం వర్తిస్తుంది. కంపెనీ షేర్ల బైబ్యాక్ చేసినప్పుడు ఇప్పటి వరకు సంస్థలకు పన్ను బాధ్యత ఉండేది. ఇప్పుడు మాత్రం ఇది వాటాదారులకు బదిలీ అయిందని గుర్తుంచుకోవాలి. అంటే డివిడెండ్ల తరహాలోనే షేర్ల బైబ్యాక్ సమయంలో కూడా పన్ను వర్తిస్తుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో కాంట్రాక్టును విక్రయిస్తే .. ఆప్షన్ ప్రీమియంపై సెక్యూరి టీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ 0.0625 శాతం నుంచి 0.1 శాతానికి పెరగనుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై ఇది 0.02 శాతంగా ఉంది.

**బడ్జెట్‌లో ప్రతిపాదించిన మార్పుల ప్రకారం.. కొత్త పన్ను విధానంలో పన్ను శ్లాబులు మారాయి. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. ఇక గతంలో రూ. 3-6 లక్షలపై 5 శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు ఈ ఇన్‌కం బ్రాకెట్‌ను రూ. 3-7 లక్షలకు చేర్చిన సంగతి తెలిసిందే. అంటే ఇక్కడ రూ. 7 లక్షల వరకు ఆదాయంపైనా 5 శాతం పన్నే ఉంటుంది. రూ. 6-9 లక్షల శ్లాబుకు 10 శాతంగా ఉండగా.. దీనిని రూ. 7-10 లక్షలకు సవరించింది.**

# విమానం బాడీపై బుల్లెట్ల ఆనవాళ్లు.. కజిక్ ప్రమాదం వెనుక కుట్ర



ప్రయాణికులతో వెళ్తున్న విమానం గాల్లో ఉండగా నియంత్రణ కోల్పోవడంతో నేరుగా భూమిపైకి దూసుకువచ్చింది. ఈ క్రమంలోనే భూమిని తాకగానే పేలిపోవడంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ విమానంలో సిబ్బంది, ప్రయాణికులు సహా మొత్తం 67 మంది ఉన్నారు. ఈ ఘోర ప్రమాదంలో 42 మంది ప్రాణాలు కోల్పోగా.. 25 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలు అయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 11 ఏళ్ల బాలిక, 16 ఏళ్ల బాలుడు సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే, ఈ ఘటన వెనుక కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కజకిస్థాన్‌లో అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కుప్పకూలిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 40 మందికి పైగా మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 28 మంది ప్రాణాలతో బయటపడినట్లు న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్ వెల్లడించింది.

అజర్ బైజన్‌లోని బాకు నగరం నుంచి రష్యాలోని గ్రోజ్నికి వెళ్తోన్న విమానం బుధవారం కజికిస్థాన్‌లోని అక్టావ్‌లో కూలిపోయింది. పక్షి ఢీకొనడంతో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా ప్రమాదం జరిగిందని రష్యా ఏవియేషన్ చెబుతుండగా.. ప్రమాద దృశ్యాలను చూసిన నెటిజన్లు మాత్రం పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఆ సమయంలో రష్యా - ఉక్రెయిన్ మధ్య దాడులు జరగడమే అందుకు కారణం. దానిని కీవ్‌కు చెందిన డ్రోన్‌గా భావించడం వల్లే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చివేసినట్లు అనుమానిస్తున్నారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రష్యా తిప్పికొడుతున్న సమయంలోనే పైలట్ అప్రమత్తమై ఓ కాల్ పంపించారని కొన్ని మీడియా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. అలాగే కొన్ని చిత్రాల్లో విమానం బాడీపై బుల్లెట్ ఆనవాళ్లు కనిపించినట్లు వెల్లడించాయి. అయితే, ఈ కథనాలపై కజఖ్‌స్థాన్ డిప్యూటీ ప్రధానిని మీడియా ప్రశ్నించగా కచ్చితమైన సమాధానం రాలేదు.

పక్షి ఢీకొట్టిన తర్వాత అత్యవసర పరిస్థితి తలెత్తడంతో.. విమానాన్ని అక్టావ్‌కు దారి మళ్లించి అత్యవసరంగా ల్యాండింగ్ చేయాలని పైలట్లు భావించారని రష్యా పౌర విమానయాన ప్రాధికార సంస్థ 'రొసావియాత్సియా' తెలిపింది. అత్యవసర ల్యాండింగ్ క్రమంలో విమానం నియంత్రణ కోల్పోయిందని,. అక్టావ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఏటవాలుగా కిందకు దిగి నేలను బలంగా ఢీకొట్టిందని వెల్లడించింది. దీంతో విమానం ముక్కలై.. మంటలు చెలరేగాయని పేర్కొంది. ఈ ప్రమాదం తాలూకు వీడియోలు సోషల్‌మీడియా వైరల్‌గా మారాయి.

మరోవైపు, ప్రపంచమంతా క్రిస్మస్ పండగని జరుపుకుంటుంటే రష్యా, ఉక్రెయిన్ మాత్రం ఢీ అంటే ఢీ అంటూ దాడులకు పాల్పడ్డాయి. ఉక్రెయిన్‌లోని ప్రధాన విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని 70కిపైగా క్షిపణులు, 100కుపైగా డ్రోన్లతో రష్యా విరుచుకుపడింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. రష్యా ప్రయోగించిన వాటిలో బాలిస్టిక్ మిసైల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. తాము కనీసం 50 క్షిపణులు, పలు డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. అటు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజున తమపై దాడులు జరిపించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమీర్ జెలెన్‌స్కీ ఆరోపించారు.

# భారత్ నెత్తిన చైనా మరో బాంబ్..

## టిబెట్ వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోపవర్ డ్యామ్

ప్రపంచలోనే అత్యంత పెద్ద హైడ్రో ప్రాజెక్ట్ చైనాలో ఉంది. యాంగ్జి కియాంగ్ నదిపై నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యామ్ వల్ల భూమికి భారీ ముప్పు ఉందని, ఇది భూమిని ప్రభావితం చేస్తోందని ఇటీవల ఓ అధ్యయనం వెల్లడించింది. దీని వల్ల భూభ్రమణ వేగం తగ్గిపోయిందని తెలిపింది. ఇక, ఈ ప్రాజెక్ట్ కారణంగా జీవారణం కూడా దెబ్బతింది. ఈ క్రమంలో చైనా దీనికి మూడు రెట్ల సామర్థ్యంతో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతోంది.

సరిహద్దుల్లో పాకిస్థాన్ కంటే చైనా రూపంలోనే పెను ప్రమాదం పొంచి ఉంది. ఓవైపు వివాదాలను పరిష్కరించుకుందామని చెబుతూనే.. ఇంకోవైపు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. తాజాగా, జలవిద్యుత్ కోసం ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి డ్రాగన్ ఆమోదం తెలిపింది. సరిహద్దుల్లోని టిబెట్‌లో యార్లంగ్ జంగ్బో నది (బహ్మపుత్ర) సామర్థ్యాన్ని అలాగే ప్రత్యేకమైన ఇంజనీరింగ్ సవాళ్లను అందిస్తుంది. ఇంజినీరింగ్ ఖర్చులతో సహా నిర్మాణ వ్యయం త్రీ గోర్జెస్ డ్యామ్ (254.2 బిలియన్ యువాన్లు (%వి%34.83 బిలియన్లు)కు కంటే నాలుగు రెట్లు అధికంగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

అయితే, ఈ ప్రాజెక్ట్ వల్ల టిబెట్ పీఠభూమిలోని పర్యావరణంతో పాటు ఎంతమంది ప్రజలు ప్రభావితవుతారనేది మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. కానీ చైనా అధికారుల ప్రకారం.. చైనా జలవిద్యుత్ సామర్థ్యంలో మూడింట ఒక వంతు మాత్రమే ఉండే టిబెట్‌లోని ప్రాజెక్టులు...పర్యావరణంపై లేదా దిగువకు నదీ ప్రవాహాలపై పెద్ద ప్రభావం ఉండదు. అయినప్పటికీ, భారత్, బంగ్లాదేశ్‌లు మాత్రం ఈ డ్యామ్ గురించి ఆందోళన లేవనెత్తుతాయి. ఈ ప్రాజెక్ట్ స్థానిక జీవావరణాన్ని మాత్రమే కాకుండా బ్రహ్మపుత్ర



దిగువ భాగంలో ఈ ప్రాజెక్ట్ నిర్మించనున్నట్లు అక్కడి మీడియా కథనాలు ప్రచురించాయి. ఈ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో చైనాకు చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనావేసింది. ప్రస్తుతం అతి పెద్ద డ్యామ్ త్రీగోర్జెస్ సామర్థ్యం కంటే (88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్) మూడు రెట్లు అధికం.

చైనా ఉమ్మడి లక్ష్యాలు, ఉద్దీపన పరిశ్రమలైన ఇంజినీరింగ్, టిబెట్‌లో ఉద్యోగ కల్పనలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుందని చైనా అధికారిక వార్త ఏజెన్సీ జున్హ్వా నివేదించింది. యార్లంగ్ జంగ్బో నది కేవలం 50 కిలోమీటర్ల తక్కువ పరిధిలోనే 2000 మీటర్ల ఎత్తు నుంచి మైదానంలోకి ప్రవేశిస్తుంది. ఇది భారీ ఎత్తున జలవిద్యుత్ నది ప్రవాహం, గమనాన్ని కూడా మార్చే అవకాశం ఉంది. ఇప్పటికే దీనికి ఎగువ ప్రాంతంలో చైనా జలవిద్యుత్ ప్రాజెక్ట్‌లు నిర్మించింది. టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది.. భారత్‌లోకి అసోం ద్వారా ప్రవేశించి.. తర్వాత బంగ్లాదేశ్ మీదుగా బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈశాన్య రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ నదీ జలాల ప్రవాహం, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనాల మధ్య ఒప్పందం ఉంది. అసోం దుఃఖదాయినిగా గుర్తింపు పొందిన బ్రహ్మపుత్రకు వర్షాకాలంలో విపరీతమైన వరదలు వస్తుంటాయి. అసోం, బంగ్లాదేశ్‌లో అపార నష్టం వాటిల్లుతుంది. ఒకవేళ, ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భారత్‌కు ఇబ్బందికర పరిస్థితి నెలకుంటుంది.

# సిరియాలో హింసాత్మక ఘర్షణలు..



**అవసరం లేకపోయినా మరణ శిక్షలు విధిస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఆ అధికారిని అరెస్ట్ చేయాలని అల్ జోలానీ ప్రభుత్వం బలగాలకు సూచించింది. దీంతో వాళ్లు సదరు అధికారిని అరెస్ట్ చేసేందుకు టార్టస్ ప్రావిన్సులో ఉన్న అతడి ఇంటికి వెళ్లారు. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు.**

సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలనలో వేలాది మంది ఖైదీలకు మరణశిక్ష విధించిన ఓ అధికారిని ప్రస్తుత ప్రభుత్వం అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించింది. ఈక్రమంలోనే పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఓవైపు బలగాలు కాల్పులు జరుపుతుంటే మరోవైపు సాయుధులు ఎదురు కాల్పులు జరపారు. ఈ ఘటనలో మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవలే తిరుగుబాటుదారులు సిరియాను వారి అధీనంలోకి తీసుకోగా.. అధ్యక్షుడు బషల్ అల్ అసద్ అక్కడి నుంచి రష్యాకు పారిపోయారు. ఇక అప్పటి నుంచి కొత్త ప్రభుత్వమే సిరియాను పాలిస్తోంది. అన్ని గొడవలు తగ్గి దేశం శాంతియుతంగా నడుస్తుందనుకుంటే.. పలు చోట్ల హింసాత్మక ఘటనలు ఇంకా చెలరేగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మాజీ అధ్యక్షుడు అసద్ పాలనలో వేలాది మంది ఖైదీలకు అన్యాయంగా మరణశిక్ష విధించిన ఓ అధికారిని అరెస్ట్ చేసేందుకు కొత్త ప్రభుత్వంలోని బలగాలు వెళ్లాయి. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం 17 మంది చనిపోగా.. 10 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి.


అసద్ దేశం విడిచి పారిపోయిన తర్వాత నుంచి దేశాధ్యక్ష పదవిని అబు మహ్మద్ అల్ జోలానీ చేజిక్కించుకున్నారు. ఈ ఘటనలో సిరియా ప్రజలు అంతా పండుగ చేసుకున్నారు. 50 ఏళ్లుగా కుటుంబ నియంత పాలను చూశామని.. ఇప్పుడు స్వేచ్ఛగా బతకొచ్చు అనుకుంటూ కలలు కన్నారు. ఆ దిశగానే అల్ జోలానీ ప్రభుత్వం కూడా అడుగులు వేసింది. కానీ తాజాగా జరిగిన ఓ ఘటనలో మరోసారి హింస చెలరేగింది. ముఖ్యంగా అసద్ పాలన సమయంలో సైనిక న్యాయ విభాగం డైరెక్టర్, ఫీల్డ్‌కోర్ట్ చీఫ్‌గా మహమ్మద్ కంజో హాసన్ బాధ్యతలు నిర్వహించారు.

అయితే మహమ్మద్ కంజో హాసన్ అన్యాయంగా అనేక మంది ఖైదీలకు మరణశిక్షలు విధించారని ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. అవసరం లేకపోయినా మరణ శిక్షలు విధిస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఆ అధికారిని అరెస్ట్ చేయాలని అల్ జోలానీ ప్రభుత్వం బలగాలకు సూచించింది. దీంతో వాళ్లు సదరు అధికారిని అరెస్ట్ చేసేందుకు టార్టస్ ప్రావిన్సులో ఉన్న అతడి ఇంటికి వెళ్లారు. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు.

దీంతో కొత్త ప్రభుత్వంలోని మొత్తం 14 మంది జనరల్ సెక్యూరిటీ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే ముగ్గురు సాయుధులు కూడా మృతి చెందారు. అంతేకాకుండా మరో 10 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ విషయాన్ని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమాన్ రైట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఇదిలా ఉండగా.. అసద్ పాలన సమయంలో చివరి 13 ఏళ్లలోనే మొత్తం 5 లక్షలకు పైగా ఖైదీలకు మరణ శిక్షలు విధించారు. దీన్ని చూస్తుంటేనే అసద్ పాలనలో ఎన్ని దుర్మార్గాలు జరిగాయో, ప్రజలపై ఎంత కఠినంగా వ్యవహరించారో అర్థం అవుతుంది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# మన్మోహన్ పాత్రను రిజెక్ట్ చేయాలనుకున్నా..







మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు. తాజాగా నటుడు అనుపమ్ ఖేర్ కూడా మన్మోహన్ గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించాడు. ఈ క్రమంలోనే మన్మోహన్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'ను బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో మన్మోహన్ పాత్రలో నటించాడు అనుపమ్ ఖేర్. మన్మోహన్ సింగ్ చాలా తెలివైన వ్యక్తి. ఎంతో నిజాయతీపరుడు, గొప్ప నాయకుడు. ఆయనను కలిసే అవకాశం నాకు రెండు సార్లు వచ్చింది. అయితే ఆయన జీవిత ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాలో నేను మన్మోహన్ పాత్రలో నటించాను. మొదట ఈ సినిమా కోసం చిత్రబృందం నన్ను సంప్రదించినప్పుడు నేను ఒప్పుకోలేదు. నా పర్సనల్ కారణాలతో పాటు రాజకీయ ఒత్తిడులకు తలవంచి ఈ ప్రాజెక్ట్‌ను వదిలేద్దమ నుకున్నాను. కానీ ఒక గొప్ప వ్యక్తి జీవిత చరిత్రలో నటించే అవకాశం అందరికి రాదని ఈ సినిమాను అంగీకరించాను. నేను చేసిన గొప్ప సినిమాల్లో ఇదోకటి. ఆ చిత్రం వివాదాస్పదం అయ్యి ఉండవచ్చు.. కానీ ఆయన మాత్రం వివాదాలు లేనివాడు అంటూ అనుపమ్ చెప్పుకోచ్చాడు. అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఈ సినిమాకు విజయ్ గుట్టే దర్శకత్వం వహించగా.. సంజయ్ బారు రచించిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్: ది మేకింగ్ అండ్ అన్ మేకింగ్ ఆఫ్ మన్మోహన్ సింగ్' అనే నవళ ఆధారంగా ఈ సినిమా వచ్చింది. 2019లో విడుదలైన ఈ చిత్రం తీవ్ర విమర్శలను ఎదుర్కోంది. మన్మోహన్ సింగ్ కూడా ఈ సినిమాపై స్పందిస్తూ.. ఇందులో చెప్పినవన్ని అబద్దాలు అంటు చెప్పుకోచ్చాడు.



## వీరమల్లులో పాటపాడిన పవన్




టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ ఏదైనా అప్‌డేట్ అందిస్తారేమోనని చూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్‌ను జనవరి 1న మధ్యాహ్నం 12 గంటలకు లాంచ్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ పాటను పవన్ కల్యాణ్ పాడటం విశేషం. తెలుగుతోపాటు మిగిలిన భాషల్లో కూడా పవన్ కల్యాణ్ వాయిస్‌తో పాట ఉండబోతుందట. ఇప్పటికే పవన్ కల్యాణ్ పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలువడమే కాదు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరి పీరియాడిక్ డ్రామాకు స్టార్ యాక్టర్ వాయిస్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించినట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.

## మహిళలెవరూ సీఎం సమావేశానికి హాజరుకానవసరం లేదు

ఇండస్ట్రీలో ఉన్న సమస్యలపైనే కాకుండా సామాజిక అంశాలపై ఎప్పుటికపుడు గొంతు వినిపించే నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది పూనమ్ కౌర్. సోషల్ మీడియాలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని తెలిసిందే. ఈ భామ ఎప్పుడు ఏదో ఒక కామెంట్ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మహిళలెవరూ సీఎం సమావేశానికి వెళ్లేంత ముఖ్యమేం కాదంటోంది పూనమ్ కౌర్. ఈ మేరకు పూనమ్ కౌర్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. సీఎంతో సమావేశానికి మహిళలెవరూ కూడా ముఖ్యమైన వ్యక్తులుగా పరిగణించబడలేదు. ఎందుకంటే మహిళలకు ఎలాంటి సమస్యలుండవు. వ్యాపార సంబంధ విషయాలు, హీరోకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రం పరిశ్రమ నిలబడుతుంది. కానీ మహిళలెవరికీ సమస్య అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది పూనమ్ కౌర్. ఈ కామెంట్స్ సినీ ప్రముఖులతో భేటిను ఉద్దేశించి చేసినవేనంటూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ కామెంట్స్‌పై ఎవరెలా స్పందిస్తారనేది చూడాలి.

## అల్లుఅర్జున్ బెయిల్ పిటిషన్ వాయిదా



సంధ్య థియేటర్ ఘటనలో టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ విచారణకు అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరయ్యాడు. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేసేందుకు పీపీ కోర్టును సమయం కోరారు. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. గతంలో విధించిన 14 రోజుల రిమాండ్ నేటితో ముగియనుంది. అయితే ఇదే కేసులో అల్లు అర్జున్‌కు హైకోర్టు ఇప్పటికే మధ్యంతర బెయిల్ ఇచ్చింది. పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనపై అరెస్టయిన అల్లు అర్జున్‌కు ఈ నెల 13న హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. తొక్కిసలాటలో మరణించిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు చేయకుండా బెయిల్ మంజూరు చేయాలంటూ అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిసన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఎదుట సుదీర్ఘ వాదనలు జరిగాయి. అల్లు అర్జున్‌తోపాటు సంధ్య థియేటర్ యజమానులు ఇద్దరికి మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. ఇంకా అరెస్ట్ కాని ఇతర నిందితుల్లో నలుగురు సంధ్య థియేటర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఉత్తర్వులను జారీచేశారు.

## రెండు పార్ట్‌లుగా విజయ్ దేవరకొండ



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పుకోచ్చాడు.

## మనం ఏదైనా చేయగలం




కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హోలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.